



కె.కోటపాడు మండలం గొల్లలపాలెంలోని కేజీబీవీ ప్రాంగణం

శ్రీమతికి ఓ ప్రశంస



- భార్యను ప్రశంసించడమూ ముఖ్యమే
- కుటుంబం సాఫీగా సాగడంలో కీలక భూమిక ఆమెదే
- ఉదయం నుంచి రాత్రి వరకూ తీవ్రంగా శ్రమించే వ్యక్తి
- తగిన గుర్తింపు, గౌరవం దక్కకపోవడంతో అనేక ఇబ్బందులు
- నేడు భార్యను ప్రశంసించే రోజు సందర్భంగా...

ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. అటువంటి ఇల్లాలి కష్టాన్ని గుర్తించే పనిని అతి తక్కువ మంది మాత్రమే చేస్తుంటారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేంత వరకు కుటుంబం కోసం అవిశ్రాంతంగా శ్రమించే భార్య చేసే పనిని గుర్తించకపోవడం వల్ల అనేక కుటుంబాల్లో వివాదాలు తలెత్తుతున్నాయి. కొంతమంది మహిళలు మానసికంగా తీవ్ర వేదనకు, ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్నారని పలు పరిశోధనలు చెబుతున్నాయి. కుటుంబ నావను సాఫీగా నడిపించడంలో కీలకంగా వ్యవహరించే భార్యను గుర్తించడం, గౌరవించడం ద్వారా ఆనందకరమైన జీవితాన్ని సాగించేందుకు అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఉద్దేశంతోనే ఏటా సెప్టెంబరు మూడో ఆదివారం భార్యను ప్రశంసించే రోజుగా నిర్వహిస్తూ వస్తున్నారు. గడిచిన కొన్నాళ్లుగా ఈ రోజును ప్రపంచంలోని అనేక దేశాల్లో నిర్వహిస్తున్నప్పటికీ..చాలా మందికి దీనిపై అవగాహన కూడా లేదు. నేడు భార్యను ప్రశంసించే (అభినందించే) రోజు సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక కథనం....

- వార్త 7వ పేజీలో..

ఖరీఫ్ ఆశాజనకం

ఆలస్యంగా ప్రారంభమైనా ఊపందుకున్న వైనం

- జిల్లాలో శత శాతం లక్ష్యానికి చేరువలో వరినాట్లు
- గత ఏడాది కంటే అదనం
- గత ఏడాది 40 వేల హెక్టార్లకే పరిమితం
- ఈ ఏడాది ఇప్పటికే 49,738 హెక్టార్లలో నాట్లు
- ఇతర పంటలు మెరుగ్గానే..



పచ్చగా కళకళలాడుతున్న వరి పొలాలు

చోడవరం, సెప్టెంబరు 14: సకాలంలో వర్షాలు కురవక ఆలస్యంగా ప్రారంభమైన ఖరీఫ్ సీజన్‌లో పంటల పరిస్థితి గత ఏడాది కంటే మెరుగ్గా ఉంది. జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 40 వేల హెక్టార్లకే వరినాట్లు పరిమితమైతే, ఈ ఏడాది సెప్టెంబరు రెండవ వారం ముగిసేసరికే 49,738 హెక్టార్లలో వరినాట్లు పూర్తయి, ఇంకా కొనసాగుతుండడం విశేషం. ప్రస్తుతం జిల్లాలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు కొనసాగుతుండడంతో ఈ ఏడాది శతశాతం వరినాట్లు పూర్తయ్యే పరిస్థితి ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.



గొలుగొండ మండలం పాతమల్లంపేటలో పచ్చని వరి పైరు

గత ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో చాలా మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని మండలాల్లోనే వర్షాలు పడడంతో ఆ ప్రభావం వరిపై పడింది. సాధారణ వరి విస్తీర్ణం 53,121 హెక్టార్లు కాగా, గత ఏడాది 40 వేల హెక్టార్లకే వరిసాగు పరిమితమైంది. గత ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా వర్షాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో అసలు ఖరీఫ్ సీజన్ పైనే అనుమానం తలెత్తింది. జూలై నెల దాటిపోయినా వానల జాడ లేకపోవడంతో అన్నదాతలు వరిపై ఆశలు వదిలేసుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే జూలై నెలాఖరు తరువాత వరుసగా వర్షాలు కురవడంతో వరినాట్లు ఊపందుకున్నాయి. నాలుగైదు మండలాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో సైతం వరినాట్లు జోరుగానే సాగాయి. సెప్టెంబరులో భారీ వర్షాలు మరింతగా కురవడంతో చాలా చోట్ల మెట్ట ప్రాంతాల రైతులకు కూడా మేలు చేకూరినట్టయింది. మెట్ట ప్రాంతాల్లో కూడా వరినాట్లు బాగానే పడ్డాయి. ఇంకా వరి నాట్లు పడని ప్రాంతాల్లో సైతం తాజాగా కురుస్తున్న వర్షాలకు వరినాట్లు వేస్తూనే ఉన్నారు. మొత్తం మీద వర్షాలు ఆలస్యమైనప్పటికీ ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాధారణ విస్తీర్ణానికి చేరువలో రావడం విశేషంగానే భావిస్తున్నారు. వరినాట్లు ఇంకా పడుతున్నందున లక్ష్యం 53,121 హెక్టార్లు పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వరితో పాటు ఈ సీజన్‌లో ఇతర పంటల పరిస్థితి కూడా గతేడాది కంటే మెరుగ్గానే ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సజ్జలు 66 హెక్టార్లలో పూర్తయి 74 శాతం మేర లక్ష్యాన్ని చేరుకోగా, చిరుధాన్యాలు కూడా 165 హెక్టార్లలో పూర్తయి 72 శాతం, మినుములు 215 హెక్టార్లలో పూర్తయి 92 శాతం, పెసలు 157 హెక్టార్లలో పూర్తయి 73 శాతం మేర లక్ష్యాన్ని చేరుకోవడంతో ఈ ఏడాది వరితో పాటు, ఇతర పంటల పరిస్థితి కూడా బాగానే ఉండే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తం మీద వరితో పాటు మొక్కజొన్న, రాగి, సజ్జ, ఇతర చిరుధాన్యాలతో పాటు వేరుశెనగ, నువ్వులు, మిరప పంటలన్నీ కలిపి 74,775 హెక్టార్ల విస్తీర్ణం కాగా, ఇప్పటికే 76 శాతం మేర పూర్తవడం గమనార్హం. స్థూలంగా చూస్తే ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పరిస్థితి బాగానే ఉండగా, ఇతర పంటలు కూడా ఒకింత ఆశాజనకంగా ఉండడంతో సీజన్ ఆశాజనకంగానే ముగిసే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రైతుల్లో ఆనందం

గొలుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరిపైరు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 1200 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. పాతమల్లంపేట, జోగంపేట, పాకలపాడు, పప్పుశెట్టిపాలెం, చీడిగుమ్మల, గుండుపాల, రావణాపల్లి, ఏటిగైరంపేట, కొత్తమల్లంపేట, అమ్మపేట, చోద్యం, కృష్ణాదేవిపేట, కొంగశింగి గ్రామాల్లో వరిపైరు ఆశాజనకంగా ఎదుగుతోందని రైతులు తెలిపారు.

కేజీబీవీల్లో టీచర్ల కొరత

- జిల్లాలో 20 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు
- ఉండాల్సిన ఉపాధ్యాయులు 300 మంది
- ప్రస్తుతం ఉన్నది 179 మంది, మరో వంద మంది గెస్ట్ ఫ్యాకల్టీలు
- గత ఏడాది మే నెల నుంచి చేపట్టని గెస్ట్ ఫ్యాకల్టీల రెన్యువల్
- భర్తీకి నోచుకోని 21 ప్రధాన సబ్జెక్టుల టీచర్ల నియామకం
- విద్యాబోధనపై తీవ్ర ప్రభావం
- గత వైసీపీ ప్రభుత్వానికి ఎన్ని వినతులు ఇచ్చినా స్పందన కరువు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)
నిరుపేద బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. గత కొన్నేళ్లుగా ఖాళీలు భర్తీ చేయకపోవడంతో విద్యాలయాల్లో బోధన అంతంతమాత్రంగానే సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు సమర్పించినా కేజీబీవీల్లో నియామకాల ప్రక్రియ జరపలేదు. ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర జాప్యం చేయడంతో అప్పట్లో అరకొర ఉపాధ్యాయులతో పాఠశాలలు నడిచాయి. కూటమి ప్రభుత్వ హయాంలో కేజీబీవీల్లో పరిస్థితులు మారతాయని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలోని 24 మండలాల్లో 20 కేజీబీవీలు ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి కేజీబీవీలో సుమారు 280 మంది విద్యార్థినుల ప్రవేశానికి అవకాశం ఉంది. దీని ప్రకారం 20 విద్యాలయాల్లో సుమారు 5,600 మంది బాలికలు చదువుతున్నారు. 20 కేజీబీవీలకు 300 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 179 మంది టీచర్లు, వంద మంది గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్నారు. ఈ వంద మంది గెస్ట్ ఫ్యాకల్టీలకు ప్రస్తుతం రెన్యువల్ చేయలేదు. దీనికి తోడు 21 ప్రధాన సబ్జెక్టులకు టీచర్లు లేరు. ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యాబోధన సక్రమంగా సాగడం లేదని గత వైసీపీ ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాలు పలుమార్లు వినతి పత్రాలు అందజేశాయి. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రతి ఏడాది విద్యా సంవత్సరం మధ్యలో నియమించిన గెస్ట్ ఫ్యాకల్టీతోనే నెట్టుకొచ్చింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. అచ్యుతాపురం కేజీబీవీలో జువాలజీ (పీజీటీ), చోడవరంలో ఎంఎల్‌టీ, జీఎఫ్‌సీ(పీజీటీ), దేవరాపల్లిలో తెలుగు, నేచురల్ సైన్స్, కె.కోటపాడు గొల్లలపాలెం కేజీబీవీలో ఫిజికల్ సైన్స్, కొంకోట మండలం తేగాడలో కేజీబీవీలో నేచురల్ సైన్స్, ఒకేషనల్ టీచర్, మాకవరపాలెంలో నేచురల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఒకేషనల్, నర్సీపట్నం మండలం వేములపూడిలో జువాలజీ, నాతవరం మండలంలో ... మిగతా 8వ పేజీలో

సీఎం, ఎక్సైజ్ మంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ సీఐ శేషుకుమారి

గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడంపై ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఫ్లెక్సీకి ఎక్సైజ్ సీఐ శేషుకుమారి, సిబ్బంది క్షీరాభిషేకం చేశారు.

- వార్త 7వ పేజీలో..

నేవీ ప్రహరీ నిర్మాణంపై నిరసన



వైలోవ గ్రామంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

వైలోవ గ్రామాన్ని ఆనుకుని కొండ చుట్టూ నేవీ ప్రహరీ గోడ నిర్మాణంపై గ్రామస్థులు శనివారం నిరసన తెలిపారు. గ్రామ ప్రధాన రహదారిపై ముళ్ల కంచెలు వేసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే నిర్మాణ పనులు చేపట్టాలని నినాదాలు చేశారు.

- వార్త 7వ పేజీలో..

చెట్టుపల్లి పీఏసీఎస్‌లో నిధుల స్వాహాపై సీరియస్

గత సీఈవో నుంచి రూ.82.97 లక్షల రికవరీకి సర్‌చార్జి ఆర్డర్ జారీ

- చలపతిరావు అవకతవకలకు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో డివిజనల్ రిజిస్ట్రార్ చర్యలు



చెట్టుపల్లి పీఏసీఎస్ కార్యాలయం

నర్సీపట్నం, సెప్టెంబరు 14: నర్సీపట్నం డీసీసీబీ పరిధిలోని చెట్టుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధుల దుర్వినియోగంపై చర్యలు ప్రారంభమయ్యాయి. గత సీఈవో చలపతిరావు నుంచి రూ.82.97 లక్షల నిధుల రికవరీకి సర్‌చార్జి ఆర్డర్ జారీ అయింది. ఈమేరకు శుక్రవారం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్ సీహెచ్ మరిడయ్యకి సహకార శాఖ ఎలమంచిలి డివిజనల్ రిజిస్ట్రార్ ఈ ఆర్డర్‌ను అందజేశారు.



ఎలమంచిలి డివిజనల్ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్‌చార్జి ఆర్డర్ కాపీని పరిశీలిస్తున్న పీఐసీ మరిడయ్య

చెట్టుపల్లి పీఏసీఎస్‌లో 2023 మే నెలాఖరు వరకు సీఈవోగా పని చేసిన పిట్టా చలపతిరావు లక్షలాది రూపాయలు స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై సహకార శాఖ డివిజనల్ రిజిస్ట్రార్ స్పందించి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌తో విచారణ చేయించారు. ఈ విచారణలో నిధుల దుర్వినియోగం వాస్తవమేనని నిర్ధారించి 2023 నవంబరులో డివిజనల్ రిజిస్ట్రార్‌కి నివేదిక ఇచ్చారు. సంబంధిత సీఈవోపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విచారణ నివేదికలో పొందుపరిచారు. దీంతో చలపతిరావు నుంచి నిధులు రికవరీ ... మిగతా 8వ పేజీలో

కొళాయిల నుంచి బురద నీరు

- వ్యాధుల బారిన గొర్లె ధర్మవరం గ్రామస్థులు
- వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు




గొర్లె ధర్మవరంలో కొళాయి ద్వారా వచ్చిన బురద నీరు

అచ్యుతాపురం, సెప్టెంబరు 14: మండలంలోని గొర్లె ధర్మవరంలో కొళాయిల ద్వారా బురద నీరు వస్తుండడతో గ్రామస్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. రెండు రోజులుగా జ్వరాలతో అధిక సంఖ్యలో రోగులు పీహెచ్‌సీకి వస్తుండడంతో వైద్య సిబ్బంది శనివారం ఈ గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరాలకు కారణాలను అన్వేషించారు. కొళాయిల ద్వారా బురద నీరు వస్తున్నట్టు గుర్తించి వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు ఎంపీడీవోకి పరిస్థితిని వివరించారు. రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి వైరల్ జ్వరాల బారిన పడిన వారికి మందులు అందజేశారు. అండమాన్ నుంచి బంధువుల ఇంటికి వచ్చిన ఓ మహిళ తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నట్టు వైద్య సిబ్బంది గుర్తించి ఆమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ శనివారం 58 మందికి రక్త పరీక్షలు చేస్తే అందులో ఎనిమిది మందికి జ్వరాలు ఉన్నట్టు తేలింది. బాధితులు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్టు పరీక్షల్లో తేలింది.

బొర్రా గుహలకు మహర్దశ

స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.30 కోట్లు మంజూరు

- వీటిలో రూ.24.1 కోట్లతో అభివృద్ధి పనులు
- గుహల్లో సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు
- ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు
- నిర్మాణం, నిర్వహణకు ఆర్‌పీఎఫ్ ఆహ్వానం
- ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలని నిబంధన



బొర్రా గుహలను ఇలా అభివృద్ధి చేయాలని ప్రణాళిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
ప్రపంచ ప్రఖ్యాతి చెందిన బొర్రా గుహలకు మహర్దశ పట్టనుంది. వీటిని అభివృద్ధి చేయడానికి, పర్యాటకులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.30 కోట్లు మంజూరుచేసింది. వీటిలో రూ.24.1 కోట్లతో పూర్తిస్థాయిలో వసతులు కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆసక్తి వ్యక్తీకరణ కోసం ప్రకటన ఇచ్చింది. ఈ ప్రాజెక్టును నిర్మించి, నిర్వహించడానికి ఐదేళ్ల కాలానికి కాంట్రాక్టు ఇవ్వనుంది. ఇది పూర్తయితే బొర్రా వెళ్లే పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. ప్రయాణం, పర్యటన సౌకర్యవంతంగా ఉంటుంది. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

లక్షల ఏళ్ల చరిత్ర

బొర్రా గుహలు ఈనాటివి కావు. 1500 లక్షల సంవత్సరాల చరిత్ర వాటి సొంతం. ఇవి విశాఖపట్నానికి 90 కి.మీ., ఏజెన్సీలో పర్యాటక కేంద్రమైన అరకులోయకు 38 కి.మీ. దూరంలో ఉన్నాయి. సముద్ర మట్టానికి 1,400 మీటర్ల ఎత్తున ఉన్నాయి. దేశంలోని అతి పెద్ద గుహల్లో ఇవి ఉన్నాయి. వీటిని చూడాలంటే బొర్రా రైల్వే స్టేషన్‌లో దిగి కిలోమీటరు ప్రయాణం చేయాలి. దీని కోసం జీపులు, ఆటోలు ఉంటాయి.

5.89 ఎకరాల్లో అభివృద్ధి పనులు

బొర్రా గుహలకు రోజూ వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. కానీ ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

మోతాదుకు మించి మాత్రలు మింగిన వృద్ధుడి మృతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 : విశాఖ కేజీహెచ్‌లో ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పట్టణ ఏఎస్‌ఐ నూకరాజు శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. ఇక్కడి గవరపాలెంలోని శాంతినగర్‌కు చెందిన కొణతాల మంగ జగ్గారావు (74) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యుల సలహా మేరకు రాత్రి వేళ నిద్ర మాత్ర వేసుకుంటున్నాడు. ఈ నెల 12వ తేదీన వైద్యులు సూచించిన ఒక మాత్రకు బదులు ఎక్కువ మాత్రలు మింగడం వల్ల అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమారు జగదీష్‌కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పాము కాటుతో యువకుడి మృతి


మృతి చెందిన శివ

నక్కపల్లి, సెప్టెంబరు 14 : మండలంలో ఓ యువకుడు పాముకాటుకు గురై మృతి చెందినట్టు నక్కపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. డొంకాడకు చెందిన సకిరెడ్డి శివ (30) శుక్రవారం రాత్రి పొలానికి వెళ్లినప్పుడు అక్కడ పాము కాటు వేసింది. ఇంటికి వస్తూ మార్గమధ్యలో అతడు స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తుని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి కాకినాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్టు హెచ్‌సీ తెలిపారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

పాయకరావుపేట, సెప్టెంబరు 14 : రైలులో ప్రయాణిస్తూ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. విశాఖ నుంచి విజయవాడ వైపు శనివారం ఉదయం వెళుతున్న రైలులో ప్రయాణిస్తున్న 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి పాయకరావుపేటలోని చెక్కానగర్ శివారులో ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. నాచురంగుపై చిన్నచిన్న తెలుపు రంగు చుక్కలు కలిగిన ఆఫ్ చేతుల చొక్కా, లైట్ ఆకుపచ్చరంగు రన్నింగ్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఎడమ చేతిపై బెంగాలీలో పేరు పచ్చబొట్టుతో ఉంది తప్ప ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరుస్తామన్నారు. వివరాలు తెలిసిన వారుంటే తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు. హెచ్‌సీ జి.మోహనరావు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి


యశ్వంత్ (ఫైల్)

దేవరాపల్లి, సెప్టెంబరు 14 : ఫ్యాన్ వేసేందుకు స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృత్యువాత పడిన విషాద ఘటన శనివారం మండలంలోని ములకాపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ములకాపల్లికి చెందిన వడగళ్ల యశ్వంత్ (10) ఇంట్లో ఫ్యాన్ వేసేందుకు స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు బయటకు తీసుకొచ్చి ఇసుకలో కప్పి బతికించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అప్పటికే ప్రాణాలు విడిచాడు. అప్పటివరకూ తమ కళ్ల ఎదుటే ఆడిపాడిన కుమారుడు విద్యుదాఘాతానికి గురై విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు గణేశ్, భవానీ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, గణేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హేమంత్, చిన్నకుమారుడు యశ్వంత్. విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా పోటీలకు పక్కా ఏర్పాట్లు

- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


క్రీడా పోటీలపై సమీక్షిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 14 : విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్రీడా పోటీలకు పక్కా ఏర్పాట్లు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎంఈవోలను ఆదేశించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరగనున్న క్రీడా పోటీలకు సంబంధించి నాలుగు మండలాల ఎంఈవోలతో శనివారం స్పీకర్ అయ్యన్న సమన్వయ సమావేశం నిర్వహించారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలబాలికలకు సీనియర్స్ జూనియర్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని ఎంఈవోలు తెలిపారు. గెలుపొందిన వారిని జిల్లా స్థాయికి పంపడం జరుగుతుందని అన్నారు. పోటీలలో పాల్గొనేందుకు వచ్చే నాలుగు మండలాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని స్పీకర్ ఆదేశించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, వాటర్ బాటిల్స్, అల్పాహారం తాను ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, జాన్ ప్రసాద్, సత్యనారాయణ, క్రీడా సమన్వయకర్త శ్రీనివాసులవాసులు నాయుడు పాల్గొన్నారు.

30 నుంచి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు

- డిసెంబరు 30న తుది జాబితా విడుదల

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 30వ తేదీ నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలు కానున్నది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 25వ తేదీతో ముగియనున్నది. ఈలోగా ఓటర్ల జాబితా కోసం ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, తుది జాబితా కోసం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఖరారు చేసింది. ఓటర్ల నమోదుకు సంబంధించి ఈనెల 30న షెడ్యూల్-1 విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుడతారు. ఓటర్ల నమోదు పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియలో చేపడతారు. ఓటర్ల నమోదుకు నవంబరు ఆరో తేదీ వరకు గడువు ఇచ్చారు. నవంబరు 23న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేసి అదే రోజు నుంచి డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాలను డిసెంబరు 25లోగా పరిష్కరించి తుది జాబితాను డిసెంబరు 25న విడుదల చేస్తారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి ఎన్నికలకు ముందు ఓటరు విధిగా పేరు నమోదు చేసుకోవాలి. టీచర్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలంటే స్కూల్ అసిస్టెంట్ నుంచి విశ్వవిద్యాలయం ఆచార్యుడు వరకు ప్రతిఒక్కరూ అర్హులే. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే టీచర్లు/అధ్యాపకులు/ఆచార్యులకు సంబంధిత విభాగాల అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

శ్రీమతికి ఓ ప్రశంస

ఆరోగ్యం ఎలా ఉంది.. భోజనం చేశావా.. భర్తలు చూపే ఇటువంటి ఆప్యాయ పలకరింపులు, మాటలే భార్యలకు కొండంత భరోసాను కలిగిస్తాయి. ఇల్లాలు గుణవంతురాలు, పనివంతురాలు అయితే ఆ కుటుంబం జీవన యానం సజావుగా సాగుతుంది. కుటుంబ వ్యవస్థలో భార్య పాత్ర ఎనలేనిది.. వెలకట్టలేనిది.. ఆమె లేని కుటుంబం నడి సముద్రంలో నావ వంటిది. అది ఎటుపోతుందో ఎవరికీ అంతుపట్టదు. కానీ భార్యను కనీసం గుర్తించేందుకు కూడా కొంతమంది భర్తలు ఇష్టపడరు. ఆమె త్యాగాన్ని, శ్రమించే తీరును ప్రతిరోజూ కాకపోయినా కనీసం ఏడాదిలో ఒక్కసారైనా గుర్తించేందుకే ఏటా సెప్టెంబరు మూడో ఆదివారం భార్యను ప్రశంసించే దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేడు భార్యను ప్రశంసే దినోత్సవం సందర్భంగా ఈ కథనం..

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

- భార్య యోగ క్షేమాలు తెలుసుకోవడం భర్త కనీస బాధ్యత
- కుటుంబ నావ సాఫీగా సాగడంలో అతివలది కీలక పాత్ర
- ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు తీవ్రమైన ఒత్తిడి
- తగిన గుర్తింపు, గౌరవం దక్కకపోవడంతో మనో వేదన
- ఆప్యాయత పలకరింపుతోనే ఆమెకు కొండంత ధైర్యం

నేడు భార్యను ప్రశంసించే రోజు



ఆ భావన తప్పు..

వంట చేయడం, అంట్లు తోమడం, పిల్లలను చూసుకోవడం వంటి పనులన్నీ ఆడవాళ్లు మాత్రమే చేయాలన్న భావన పెరిగిపోయింది. ఈ భావనతోనే భార్య ఎంత కష్టపడి పని చేసినా గుర్తింపు దక్కడం లేదు. ఆ భావన తప్పు అని నిపుణులు చెబుతున్నారు. భర్త కుటుంబం కోసం బయట ఎంత కష్టపడుతుంటాడో అంతకు రెట్టించిన కష్టాన్ని భార్య పడుతుంది. ఆ కష్టాన్ని కనీసం గుర్తించడం ద్వారా వారికి గుర్తింపును ఇచ్చినట్టు అవుతుంది. ఈ గుర్తింపు లేకపోతే కుటుంబంలో అనేక వివాదాలు చెలరేగుతాయి.



తీవ్రమైన ఒత్తిడికి గురయ్యే ప్రమాదం..

చాలామంది మహిళలు ఇంట్లో పని చేస్తూనే, బయట కూడా ఉద్యోగాలు చేస్తుంటారు. వీరు తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. వృత్తిపరమైన ఒత్తిడితోపాటు ఇంట్లో పనులు చేయలేక ఒత్తిడికి గురయ్యే భార్యల పట్ల మరింత సానుకూలంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే వారు తీవ్రమైన డిప్రెషన్ బారినపడే అవకాశం ఉంది. భర్త కోసం ఎంత చేసినా పట్టించుకోనట్టు వ్యవహరించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా తాను ఎంత చేసినా ప్రయోజనం లేకుండా పోతోందన్న భావనతో తీవ్రమైన నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల ఒత్తిడి, డిప్రెషన్, వైవాహిక జీవితంలో గొడవలకు అవకాశం ఉంటుంది. ఇంట్లో లభించని ఆ గుర్తింపు, గౌరవాన్ని బయట కోరుకునే ప్రమాదం కూడా ఉంది. ఆ కోరిక వివాహేతర సంబంధాలకు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఇలా చేయడం మేలు..

ప్రతిరోజూ భార్యను ప్రశంసించడం చాలా మందికి సాధ్యపడకపోవచ్చు. కనీసం ఏడాదిలో ఒక్కరోజైనా భార్యతో ప్రత్యేకంగా గడిపేలా చేసేందుకు ఈ రోజును నిర్వహిస్తున్నారు. భార్యను ప్రశంసించే రోజు ఇంట్లో పనికి భార్యను పూర్తిగా దూరంగా ఉంచాలి. వీలైతే భర్తే ఆమెకు నచ్చిన వంటలు చేసి పెట్టాలి. నచ్చిన ప్లేస్‌కు తీసుకెళ్లి సర్ప్రైజ్ చేయాలి. పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులకు దూరంగా భార్య, భర్త ఇద్దరు మాత్రమే ఆ రోజంతా గడిపేలా ప్లాన్ చేసుకోవాలి. దీనివల్ల అప్పటివరకు ఇద్దరి మధ్య ఉన్న చిన్నపాటి ఇబ్బందులు తొలగిపోతాయి. ఆ రోజు ఆమె చేసే ప్రతి పనిని అభినందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి.



మహిళల్లో పెరుగుతున్న నిరాశ, నిస్పృహలు

- డాక్టర్ పూజిత జోస్యుల, మానసిక నిపుణులు



ప్రతి భార్య తాను చేసే పనికి గుర్తింపును కోరుకుంటుంది. అనేక కుటుంబాల్లో భార్యకు తగిన గుర్తింపు లభించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భార్య, భర్తల మధ్య గొడవలకు ప్రధాన కారణం కూడా అదే. ఇంట్లో ఎంత పని చేసినా కనీసం పట్టించుకోవడం లేదని భార్యలు చెబుతున్నారు. ఎంత కష్టపడినా గుర్తింపు లేని చోట ఎందుకు ఉండాలన్న భావన చాలామంది మహిళల్లో పెరుగుతోంది. భార్య చేసే పనిని గుర్తించడం, గౌరవించడం కనీస బాధ్యతగా భర్త గుర్తించాలి. ముఖ్యంగా భార్యను ఎప్పటిపుడు బయటకు తీసుకెళ్లడం, ఇటువంటి ప్రత్యేక రోజుల్లో గిఫ్ట్‌లు, ఇష్టమైన వస్తువులు ఇవ్వడం ద్వారా వారిలో పెరుగు తున్న నిరాశ, నిస్పృహ, ఒత్తిడి వంటి సమస్యలకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుంది.

ఏమని ప్రశంసించాలి..

ప్రశంస అంటే భార్యపై పొగడ్తల వర్షం కురిపించడం కాదు. ప్రేమ పూర్వకంగా వ్యవహరిస్తూ ఆమె చేసే పనిని అభినందించడం. ఈ పని ప్రతిరోజూ చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ, ఉరుకులు, పరుగుల జీవితం, ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు, భార్య చేయాల్సిన పని కాబట్టి ప్రత్యేకంగా ఎందుకు అభినందించాలన్న భావన. ఈ ప్రశంసకు భార్యలను దూరం చేస్తుంది. ప్రతి సందర్భంలోనూ భార్య ఉత్సాహంగా పని చేసేలా చేసే అవకాశం భర్తకు ఉంటుంది. ఉదాహరణకు టీ ఇచ్చినప్పుడు చాలా బాగుందని చెప్పడం ద్వారా ఆమె ఎంతగానో ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది. చీర/డ్రెస్ కొత్తది కట్టుకున్నప్పుడు ఇందులో చాలా అందంగా ఉన్నావు అని భర్త చెప్పే మాట ఆమెకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. ఏదైనా ప్రత్యేక వంటకం చేసినప్పుడు, ప్రత్యేక సందర్భాల్లో ఇలా చిన్నపాటి పొగడ్త ఆమె మరింత ఉత్సాహంగా పని చేసేందుకు దోహదం చేస్తుంది. దీని వల్ల భార్యాభర్తల వైవాహిక జీవితం కూడా ఆనందంగా సాగుతుంది.

నేవీ ప్రహరీ నిర్మాణంపై నిరసన

- నేవీ అధికారుల చర్యలపై గ్రామస్థులు ఆగ్రహం
- ముఖద్వారం వద్ద అంతా బైఠాయింపు
- వాహనాలు రాకుండా రోడ్డుపై కంచె వేసి నినాదాలు
- ఆర్డీవో, తహసీల్దార్, డీఎస్పీ, సీఐ రాక
- సమస్యలను వివరించిన పెద్దలు, గ్రామస్థులు
- అధికారుల సమాధానంతో ఆందోళన విరమణ


నిరసన తెలుపుతున్న గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న అధికారులు

రాంబిల్లి, సెప్టెంబరు 14 : గ్రామస్థులకు జీవనాధారమైన.., గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ నేవీ అధికారులు డీఆర్‌డీవో ద్వారా ప్రహరీ గోడ నిర్మిస్తుండడం వల్ల అన్ని విధాలా నష్టపోతున్నామని ఆరోపిస్తూ మండలంలోని వై.లోవ గ్రామస్థులు శనివారం ఆందోళనకు దిగారు. గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు బద్ది నారాయణరావు, బి.నారాయణరావుల ఆధ్వర్యంలో గ్రామ ముఖద్వారం వద్ద గల ప్రధాన రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గ్రామంలోకి ఏ వాహనం రాకుండా రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె వేశారు. కలెక్టర్ వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని, ఆ తరువాతే నేవీ గోడ నిర్మాణం చేపట్టాలని నినాదాలు చేశారు. ముందుగా విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర గ్రామానికి విచ్చేసి ఆందోళనకారులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, రాంబిల్లి తహసీల్దార్ పి.భాగ్యవతి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, రాంబిల్లి సీఐ నర్సింగరావులు సంఘటనా స్థలానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారితో సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ పూర్వకాలం నుంచి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలతో పాడి, కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ కొండ మీదే పశువుల పాకలు ఏర్పాటు చేసుకొని పశులను మేపుకుంటున్నట్టు చెప్పారు. ఉపాధి పనులు కూడా ఈ కొండమీదే చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని వివరించారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న శారదా నది పొంగి ప్రవహించినప్పుడు నదిలో నీరు గ్రామంలోకి చేరుతుందన్నారు. ఆటువంటి సమయంలో తమ గ్రామానికి ఈ కొండ రక్షణగా ఉంటుందని వివరించారు. నేవీ అధికారులు గ్రామస్థులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నట్టు ఆరోపించారు. ఈ కారణంగా ఏడాది కాలంగా గ్రామస్థులమంతా ఉపాధితో పాటు, అన్నివిధాలా నష్టపోయామని వారు వాపోయారు. గ్రామంలో అర ఎకరం భూమిని శ్మశానవాటికకు కేటాయించాలని, గ్రామంలోని ఇళ్ల వద్ద నుంచి 10 అడుగుల దూరంలో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టుకోవాలని, గ్రామానికి ఇబ్బందులు లేకుండా పనులు చేయాలని, గ్రామస్థులకు ఉపాధి కల్పించాలని, గ్రామ పెద్దలపై అటవీ అధికారులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని, ఏడాది కాలంగా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు అధికారులను కోరారు. వీటిపై ఆర్డీవో చిన్నికృష్ణ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని అభివృద్ధి చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని వారికి తెలిపారు.

అలాగే వేరొక చోట కూడా మరికొంత శ్మశానవాటికకు స్థలం ఏర్పాటు చేస్తామన్నారు. ఉపాధి విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు. గ్రామ పెద్దలపై అటవీ అధికారులు పెట్టిన కేసుల అంశాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళతానన్నారు. గ్రామంలోని ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గతంలో రెవెన్యూ శాఖ నిర్వహించిన సర్వే ఆధారంగా ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ పర్యవేక్షణలో నేవీ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే, కలెక్టర్‌తో మాట్లాడి తమ పరిధిలో ఉన్న సమస్యలను త్వరగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వారికి హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళనను విరమించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని గ్రామ సమస్యలు పరిష్కరించేలా చూడాలని, లేనిపక్షంలో గ్రామస్థులమంతా కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వీరి ఆందోళనకు సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకలవలాపల్లి మాజీ సర్పంచ్ కర్రి సింహగిరి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రావి దేముళ్ళు, చిన కలవలాపల్లి సర్పంచ్ వై.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇకపై ఒక్కరే ఎంఈవో?

ప్రభుత్వ నిర్ణయం... డీఈవోలకు సమాచారం

- గత ప్రభుత్వం తీసుకువచ్చిన మండలానికి ఇద్దరు ఎంఈవోల విధానానికి స్వస్తి
- స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలానికి ఇద్దరు విద్యాశాఖాధికారుల విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనున్నట్టు తెలిసింది. గతంలో మాదిరిగా ఎంఈవో ఒక్కరే ఉంటారు. అయితే పాఠశాలల్లో విద్యా బోధనను పర్యవేక్షించడానికి స్కూల్ కాంప్లెక్స్‌ల వ్యవస్థను పటిష్ఠం చేసి, అక్కడ హెచ్‌ఎంకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారు.

గతంలో మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. విద్యాబోధన, టీచర్ల సర్వీస్ వ్యవహారాలు, ప్రభుత్వ పథకాలు అమలు తీరును పర్యవేక్షించేవారు. అయితే ఎంఈవోకు పనిభారం ఎక్కువగా ఉందని భావించిన గత పాలకులు ప్రతి మండలానికి రెండో ఎంఈవో పోస్టును కేటాయించారు. ఎంఈవో-1గా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు, ఎంఈవో-2గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలలో సీనియర్లకు అవకాశం కల్పించారు. మండలంలో పాఠశాలల పర్యవేక్షణ కంటే ఇరువురు ఎంఈవోల మధ్య ఆధిపత్య పోరే ఎక్కువగా ఉండేది. ప్రైవేటు స్కూళ్లు ఎక్కువగా ఉన్న విశాఖ జిల్లాలో వాటి గుర్తింపు వ్యవహారంలో ఎంఈవోల మధ్య కొన్నాళ్లు ప్రచ్ఛన్న యుద్ధం జరిగింది. చివరకు కొంతమంది చొరవతో ప్రైవేటు పాఠశాలలను ఇద్దరు చెరో సగం పంచుకుని భారీగా వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇద్దరు ఎంఈవోల మధ్య వివాదాలు ఎక్కువగా ఉండడంతో కొత్త ప్రభుత్వం మండలానికి ఒకరిని మాత్రమే ఉంచాలని సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చింది. ఇప్పటికే ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం వచ్చింది. ఒక్క ఎంఈవోనే కొనసాగించనున్న నేపథ్యంలో విద్యా బోధన, పాఠశాలలపై పర్యవేక్షణ బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించనున్నారు. విశాఖ జిల్లాలో 543 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 54 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. రమారమి పది వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అందుబాటులో ఉంటూ అన్ని సదుపాయాలున్న ఉన్నత పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్‌గా పరిగణిస్తుంటారు. తాజా నిర్ణయంతో స్కూల్ కాంప్లెక్స్‌ల సంఖ్య స్వల్పంగా తగ్గుతుందని చెబుతున్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్ బాధ్యత అందుబాటులో ఉన్న ఉన్నత పాఠశాలకు అప్పగించనున్నారు. ప్రధానోపాధ్యాయ పోస్టు లేని బోని స్కూలు కాంప్లెక్స్‌ను గొట్టిపల్లిలో, గండిగుండను గిడిజాలలో కలుపుతున్నారు. స్కూలు కాంప్లెక్స్ పరిధిలో 35 నుంచి 87 ఎస్జీటీ టీచర్లు ఉండేలా మార్పులు చేస్తున్నారు. తాజా నిర్ణయంతో స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఎక్కువ అధికారాలు అప్పగిస్తున్నారు. ఎస్జీటీలకు సంబంధించి సర్వీస్ వ్యవహారాలు, సెలవులు మంజూరు అధికారాలు కట్టబెడతారు. ఇక ఎంఈవోలను పాఠశాలల తనిఖీ బాధ్యతల వరకే పరిమితం చేయనున్నారు.

సీఎం, ఎక్సైజ్ శాఖా మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

కొత్తూరు, సెప్టెంబర్ 14 : రాష్ట్రంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను ఏకీకరణ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు శనివారం అనకాపల్లిలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సిబ్బంది పాలాభిషేకం చేశారు. సీఐ శేషుకుమారి ముఖ్య అతిథిగా హాజరై వారి చిత్రపటాలపై పాలు పోసి అభిషేకించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఎక్సైజ్ శాఖను వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్ఈబీగా విభజించిందన్నారు. 70శాతం ఎస్ఈబీ గాను, 30శాతం ఎక్సైజ్ శాఖగాను పరిగణించి సిబ్బందిని విభజించారని పేర్కొన్నారు. తమ అభిప్రాయం లేకుండా ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని వాపోయారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖా మంత్రికి వివరించడంతో వారు స్పందించి ఏకీకరణ శాఖగా ప్రకటించారని వారంతా హర్షం వ్యక్తం చేశారు.

రేపటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

అనకాపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమాన్ని ఈ సోమవారం ఈద్‌ఈ మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం రద్దు కావడంతో ఆ రోజు అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గ్రహించి సోమవారం కలెక్టరేట్‌కు వివిధ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు రావద్దని ఆమె కోరారు.

కేజీబీవీల్లో టీచర్ల కొరత

... 5వ పేజీ తరువాయి

గణితం టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే రావికమతం మండలం గర్నికం కేజీబీవీలో గణితం, జువాలజీ (పీజీటీ), వి.మాడుగులలో ఫిజికల్ సైన్స్, బోటనీ, ఎస్.రాయవరం మండలం తిమ్మాపురంలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతేడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు కొనసాగినా అప్పటి నుంచి ఇప్పటి వరకు వారిని రెన్యువల్ చేయలేదు. దీని ప్రభావం విద్యార్థినుల చదువుపై పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

పీఏసీఎస్‌లో నిధుల స్వాహాపై సీరియస్

... 5వ పేజీ తరువాయి

చేయడానికి డివిజనల్ రిజిస్ట్రార్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చెట్టుపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఉన్న సీహెచ్ మరిడయ్య.. డివిజనల్ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్‌చార్జి ఆర్డర్‌ను అందుకున్నారు. ఈ ఆర్డర్ కాపీని గత సీఈవో చలపతిరావుకు కూడా అందజేస్తామని మరిడయ్య తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తీర్మానం చేసి డివిజనల్ రిజిస్ట్రార్ కోర్టులో ఈపీ (ఎగ్జిక్యూటివ్ పిటిషన్) ఫైల్ చేస్తామని చెప్పారు. దీని తరువాత నిధులు రికవరీ చేయడానికి ఒక సేల్స్ ఆఫీసర్‌ను నియమిస్తారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన గత సీఈవో ఆస్తులు జప్తు చేయడానికి నోటీసులు ఇస్తారు. దీనిపై పీఏసీ అధికారి సీహెచ్ మరిడయ్యను వివరణ కోరగా డివిజన్ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్‌చార్జి ఆర్డర్ ప్రకారం నిధుల రికవరీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బొర్రా గుహలకు మహర్దశ



బొర్రా అభివృద్ధికి సంబంధించిన నమూనా

... 5వ పేజీ తరువాయి

వారికి సరైన ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో 5.89 ఎకరాల్లో రూ.24 కోట్లతో సౌకర్యాలు సమకూర్చాలని ఏపీటీడీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో అచ్చంగా రెండు ఎకరాల స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించారు. అలాగే బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో అందమైన ద్వారం, గుహల వద్ద మరో ద్వారం నిర్మిస్తారు. ఆ ప్రాంతం వాహనాల పొగతో కాలుష్యమయం కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలను నడుపుతారు. వాటి ద్వారా పర్యాటకులను గుహలకు తీసుకువెళ్లి తీసుకువస్తారు. పర్యాటకుల కోసం టాయిలెట్లు, లగేజీ భద్రపరుచుకునే గదులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తారు.

ప్రత్యేకంగా మార్కెట్ స్ట్రీట్

బొర్రా గుహల ముందు గిరిజనులు తయారుచేసిన, పండించిన వాటిని విక్రయిస్తున్నారు. దీనిని మార్కెట్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేస్తారు. రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. పర్యాటకులు పక్కనే ఉన్న లోయ అందాలను తిలకించేందుకు వ్యూపాయింట్లు, విజువల్ డెక్ ఏర్పాటుచేస్తారు. సిటింగ్ ఏరియా ఉంటుంది. అడ్వంచర్ స్పోర్ట్స్, ఎగ్జిబిషన్ వంటివి పెడతారు.

విజిటర్స్ కౌంటర్

పర్యాటకుల వసతి కోసం రెండు అంతస్తుల భవనం నిర్మిస్తారు. ఇక్కడే టికెట్లు, బ్యాగేజీ, రెస్టారెంట్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఇక గుహల లోపల అవసరమైన ప్రాంతాల్లో స్టెయిర్ కేసులు, రెయిలింగ్‌లు పెడతారు. కొత్తగా విద్యుద్దీపాలు అమరుస్తారు. సీసీ టీవీ కెమెరాలు వంటివి ఉంటాయి.

సౌండ్ అండ్ లైటింగ్ షో

గుహ లోపలి అందాలను విభిన్న కోణాల్లో చూపించడానికి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తారు. దాంతో కళ్ల ముందు రంగుల ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. ఇది మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాజెక్టుకు టెండర్లు సమర్పించడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు పర్యాటక శాఖ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీనివాస పాణి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

లోక్ అదాలత్‌కు అద్భుత స్పందన

▸▸ ఇరువర్గాలను ఆలోచింపజేసిన న్యాయమూర్తుల ప్రసంగాలు ▸▸ అనకాపల్లి కోర్టులో 800, ఎలమంచిలి కోర్టులో 356 కేసులు పరిష్కారం



అనకాపల్లి కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 : రాజీ మార్గం ద్వారా సమస్యలను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు చక్కని వేదికలని, ఇటువంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా జడ్జి శ్రీవిద్య పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం అనకాపల్లి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ మార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటే కోర్టు చుట్టూ తిరిగే పని ఉండ దన్నారు. పలువురు న్యాయమూర్తులు మాట్లాడుతూ అనవసరమైన గొడవలు పెంచుకుని బంధుత్వాలు పోగొట్టుకోవద్దని సూచించారు. కోర్టుల చుట్టూ తిరిగితే ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని వివరించారు.

ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఈ లోక్ అదాలత్ సాయంత్రం వరకు కొనసాగింది. ఇందులో సివిల్, క్రిమినల్ కేసులు 800 వరకు పరిష్కారమైనట్టు బార్ అసోసియేషన్ ప్రతినిధి సాయిరాం తెలిపారు. అలాగే, ఒక ఫ్యామిలీ కేసులో మెయింటెనెన్స్ కింద రూ.మూడు లక్షలను బాధితురాలికి రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి ఇప్పించారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలి కోర్టు సముదాయంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి విజయ

ఎలమంచిలి కోర్టులో..

ఎలమంచిలి : ఇక్కడి కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అడిషనల్ సివిల్ జడ్జి ఎ.రమేష్ మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలకు కోర్టుల వరకు వెళ్లి సమయంతో పాటు డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. అనంతరం 356 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా విజయ్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 14 : ఇక్కడి మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కె.విజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రాపురం మునిసిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఎలమంచిలి మునిసిపాలిటీగా మేనేజర్‌గా విచ్చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రభాకర్‌రావుకు పలాస మునిసిపాలిటీకి బదిలీ కావడంతో విజయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ్‌కుమార్

సర్కారు మారినా స్వామి భక్తి మారలేదు

▸▸ అధికారుల తీరుపై ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు 'భీమరశెట్టి' ఆగ్రహం

▸▸ జగన్ ఫొటోలున్న వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేయడంపై అభ్యంతరం

▸▸ వాట్సాప్ ద్వారా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే తొలగింపు



రేషన్ వాహనంపై ఉన్న మాజీ సీఎం జగన్ ఫొటో

ఎస్.రాయవరం, సెప్టెంబరు 14 : వైసీపీ ప్రభుత్వం మారి కొన్ని నెలలు గడుస్తున్నా పలువురు అధికారులకు ఇంకా స్వామి భక్తి తగ్గలేదని ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రామయ్యపట్నం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో ఉన్న వాహనంపై శనివారం గ్రామస్థులకు రేషన్ బియ్యం పింపిణీ చేయడాన్ని ఆయన గుర్తించారు. ఆ ఫొటోలను వాట్సాప్ ద్వారా తహసీల్దార్‌కు పంపించి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ సిబ్బంది ద్వారా ఆ రేషన్ వాహనంపై ఉన్న జగన్ ఫొటోలను తొలగించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంకా జగన్ ఫొటోతో ఉన్న వాహనంపై రేషన్ పంపిణీ చేస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఏదో ఇంకా పలువురు అధికారులకు తెలిసినట్టు లేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రేషన్ వాహనాలపై పలుచోట్ల ఉన్న జగన్ ఫొటోలను తొలగించడంతో పాటు ఈ విషయంతో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న అధికారులు చర్యలు చేపట్టాల్సిందిగా ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావుతో పాటు పలువురు గ్రామస్థులు కోరారు.



ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడి ఫిర్యాదుతో జగన్ ఫొటోను తొలగించిన దృశ్యం

అరుణాచలేశ్వరుని సన్నిధిలో హోం మంత్రి



స్వామికి దీపారాధన చేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, సెప్టెంబరు 14 : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆమె అరుణాచలేశ్వరుడి ముఖద్వారం వద్ద దీపారాధన చేసి, టెంకాయలు కొట్టి, గిరిప్రదక్షిణ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, వరదల వల్ల రాష్ట్రానికి ఎటువంటి నష్టం రాకుండా చూడాలని స్వామిని వేడుకున్నట్టు ఇక్కడి విలేకరులకు ఆమె తెలిపారు. టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, కొప్పిశెట్టి వెంకటేశ్, అబద్దం, కొప్పిశెట్టి బుజ్జి, గుర్రం రామకృష్ణ, గోసల శ్రీకాంత్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

సిద్ధి వినాయకుడ్ని దర్శించుకున్న కొణతాల



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 : గవరపాలెం చినరామస్వామి కోవెల వద్ద గల చినరామ సిద్ధి వినాయక సేవా సంఘం వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటైన ఈ వేడుకకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ 80వ వార్డు అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు హాజరై నిర్వాహకులను అభినందించారు. కూటమి నాయకులు బొడ్డేడ మురళీ, మళ్ల శ్రీనివాసరావు, దూలం గోపి, కాండ్రేగుల బుజ్జి, చినరామస్వామి ఆలయ ధర్మకర్త విల్లూరి మహాలక్ష్మీనాయుడు, పెంటకోట చంద్రరావు, అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందం నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో 'పంచకర్ల' పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సబ్బవరం, సెప్టెంబరు 14 : జీవీఎంసీ 88వ వార్డు పరిధి నంగినారపాడు, సబ్బవరం సాయినగర్ కాలనీ, దుర్గానగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శనివారం సందర్శించారు. తొలుత స్వామిని దర్శించుకున్న అనంతరం అన్న సమారాధనలను ప్రారంభించారు. వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు ఇందలి వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు, ఎర్నిబాబు, బంతికోళ్ల పద్మ, బేతిన శ్రీనివాసరావు, టి.శేఖర్, కుమార్, జెట్టి ప్రసాద్, పెద్దాడ రమణమ్మ, సిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శ్రవణ నక్షత్రం పూజలు

పరవాడ, సెప్టెంబరు 14 : మండలంలోని ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నక్షత్ర పూజలు నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు హరికృష్ణామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలు జరుపుతామన్నారు.

21న సామూహిక సత్యదేవుని వ్రతం

పరవాడ, సెప్టెంబరు 14 : వాడ చీపురుపల్లి రామాలయంలో ఈ నెల 21న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్టు బ్రహ్మకుమారీస్ ప్రతినిధి ప్రభాకర్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి వారి వ్రతం జరుగుతుందన్నారు. బెంగళూరుకు చెందిన రాజయోగి బీకే మంజునాథ్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరుపుతామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

'ఎసెన్షియా'లో క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



క్షతగాత్రుడికి చెక్కు అందిస్తున్న ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, సెప్టెంబరు 14 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన మునిసిపాలిటీ పరిధి సోమలింగపాలెం వార్డుకు చెందిన పిల్లా మెహర్‌బాబుకు వైసీపీ బాసటగా నిలిచింది. పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు రూ.లక్ష చెక్కును ఎంపీపీ బోదెపు గోవింద్ శనివారం అందజేశారు. ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, వైసీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కౌన్సిలర్లు రాపేటి సంతోష్, పిట్టా సత్తిబాబు, అయ్యల గోవిందనాయుడు, సత్యనారాయణ, మర్రి రాజబాబు, ఎడ్ల వాసులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో చూడి గేదెకు తీవ్ర గాయాలు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 14 : మంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో శుక్రవారం రాత్రి కుర్రెళ్ళ అచ్చియ్యకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. పాకలో సుమారు రూ.లక్ష విలువ చేసే చూడి గేదె కట్టి ఉంచడంతో మంటలకు 70 శాతం కాలిపోయింది. శనివారం ఉదయం ఘటనా స్థలాన్ని సీఐ జి.అప్పన్న పరిశీలించారు. ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఉద్దేశపూర్వకంగా ఎవరైనా పాకకు నిప్పు పెట్టారా.. అన్న దానిపై పలువురు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

పేకాట ఆడుతున్న ముగ్గురు అరెస్టు

- రూ 5,120 నగదు, 20 బైక్‌లు స్వాధీనం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 14 : గుర్రాజుపేట సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 5,120 నగదు, ఇరవై బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు నక్కపల్లి సీఐ కుమార్‌స్వామి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడులు చేసినట్టు చెప్పారు.

సమస్యలపై ఆస్పత్రుల వద్ద వైద్యులు, సిబ్బంది ఆందోళన



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 : సమస్యలపై ఎన్టీఆర్ వైద్యాలయంలో పనిచేస్తున్న కార్మికులు శనివారం ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంతోష్, రాంప్రసాద్, నూకరాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే, అనకాపల్లిలోని కోట్నివీధి, గవరపాలెంలలో గల యూపీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మెకు దిగారు. దీంతో ఆయా ఆస్పత్రుల్లోని స్టాఫ్ నర్సులే రోగులకు శనివారం వైద్య సేవలందించారు. వైద్యుల సర్వీస్ కోటాను 30 నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం గత నెలలో విడుదల చేసిన జీవో 85కు వ్యతిరేకంగా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ఈనెల 12వ తేదీ నుంచి వైద్యులు నిరసన కొనసాగిస్తున్నారు. శనివారం విధులకు హాజరవ్వకుండా సమ్మె చేపట్టడంతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు స్టాఫ్‌నర్సులు బీపీ చెక్ చేయడం, జ్వరంతో ఉన్న వారికి తగిన మందులు ఇవ్వడం వంటివి చేశారు.

అచ్యుతాపురం : రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు చేస్తున్న ఆందోళనలో భాగంగా శనివారం అచ్యుతాపురం పీహెచ్‌లో ఓపీ సేవలు బంద్ అయ్యాయి. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడ ప్రతి రోజు 150 నుంచి 180 వరకు ఓపీ ఉంటుంది. ప్రస్తుతం గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తుండడంతో భారీగానే రోగులు వచ్చారు. అయితే వైద్యాధికారి శ్రావ్య కేవలం అత్యవసర రోగులను మాత్రమే పరీక్షించారు. వైద్య సిబ్బంది 50 మంది వరకు ఓపీ సేవలు చేసి మిగిలిన వారిని పంపించేశారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడి, ప్రవేటు ఆసుపత్రులను ఆశ్రయించారు.

యువజనోత్సవాల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట, సెప్టెంబరు 14 : యువజనోత్స వాల పోటీల్లో ఇక్కడి శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పి.నందిని, ఎస్‌కే మదీనాబీబీ, టి.శ్రీవల్లి, ఎం.ఉషశ్రీ, జి.లక్ష్మిజ్యోతి బృందం ప్రదర్శించిన హెర్బల్ సోప్, లిక్విడ్ సోప్, ఫినాయిల్ ప్రాజెక్ట్ ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే, జానపద గేయాలు, జానపద నృత్యంలోనూ ఈ విద్యార్థులు అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు తదితరులు శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందిస్తున్న సీహెచ్‌వీకే నరసింహారావు

హరిపాలెంలో షూటింగ్ సందడి



హీరో విక్రమ్‌తో ఓ సన్నివేశాన్ని తెరకెక్కిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, సెప్టెంబరు 14 : హరిపాలెంలో శనివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నిర్మాతగా నాయుడు, డైరెక్టర్‌గా కాగేష్‌గా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో హీరోగా విక్రమ్, హీరోయిన్‌గా సంధ్య కొత్తవారు నటిస్తున్నారు. కుటుంబ నేపథ్యంలో యువత ఆలోచనకు తగ్గట్టు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని డైరెక్టర్ తెలిపారు. హరిపాలెం వంతెనపై షూటింగ్ జరగడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సెజ్‌లో కర్మాగారాలకు ఉద్యోగులను తీసుకువెళ్లే బస్సులతో పాటు ఇతర వాహనాలు పదుల సంఖ్యలో నిలిచిపోయాయి. సుమారు గంట సేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో అంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వాసవిమాత సేవలో సామవేద షణ్ముఖ శర్మ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సద్గురు సామవేద షణ్ముఖశర్మ కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు, వుప్పల శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు.

ఏపీఐఐసీ స్థలాలపై ప్రత్యేక గ్రీవెన్స్

అనకాపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీఐఐసీ స్థలాలకు సంబంధించి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నామని ఏపీఐఐసీ ఎస్‌డీసీ రమామణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఉంటుందని వివరించారు. భూసేకరణలో నష్టపోయిన రైతులు వారి వద్ద ఉన్న పూర్తి డాక్యుమెంట్లు, ఆధారాలతో హాజరు కావాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి ఆర్డీవో, ఏపీఐఐసీ, తహసీల్దార్ తదితరులు ఈ కార్యాక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

అనకాపల్లి ఉపాధ్యాయిని శ్రీదేవికి అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీదేవి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 : పట్టణంలోని చదువులవారి వీధికి చెందిన ఉపాధ్యాయిని గంపా శ్రీదేవికి సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు లభించింది. తిరుపతిలోని జీవకోన విశ్వం స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు సుబ్రహ్మణ్య శర్మ చేతుల మీదుగా శనివారం ఆమె ఈ అవార్డును అందుకున్నారు. యువతేజ, అబ్దుల్‌కలాం విజన్ ట్రస్టుల సంయుక్త ఆధ్వ ర్యంలో జాతీయ అవార్డుకు తనను ఎంపిక చేశారని ఆమె ఇక్కడి విలేకరులకు వివరించారు.

'శ్రీజ డైరీ'లో ఏఎంఏఎల్ విద్యార్థులకు ఉద్యోగాల

కొత్తూరు, సెప్టెంబరు 14 : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది డిగ్రీ విద్యార్థులు తిరుపతిలో ఉన్న శ్రీజ డైరీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా ఫీల్డ్ సూపర్‌వైజర్లుగా పనిచేయనున్నారని పేర్కొంటూ అభినందించారు.

వరద బాధితులకు 'చెట్టినాడ్' రూ.కోటి విరాళం



చంద్రబాబుకు చెక్ అందిస్తున్న సంస సీఎండీ రామస్వామి

కశింకోట, సెప్టెంబరు 14 : విజయవాడ వరద బాధితులకు ఇక్కడున్న చెట్టినాడ్ సిమెంటు ఫ్యాక్టరీ సీఎండీ ముత్తయ్య రామస్వామి బాసటగా నిలిచారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శనివారం విజయవాడలో కలిసి రూ.కోటి చెక్కు అందజేశారు. సంస్థ ప్లాంట్ హెడ్ ప్రసాద్‌బాబు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరసింహరాజులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 : తుమ్మపాలకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని పట్టణ ఎస్ఐ మహ్మద్ ఆలీ తెలిపారు. మేనమామ ఇంట్లో నివాసం ఉంటున్న యువతి ఈ నెల 12వ తేదీ రాత్రి బట్టలు కొనుగోలు చేసి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆమె జాడ తెలియకపోవడంతో మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నక్కపల్లి మండలంలో 220ఎకరాల్లో పంట నష్టం

నక్కపల్లి, సెప్టెంబరు 14 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో 220 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు తహసీల్దార్ అంబేడ్కర్, ఏవో ఉమా ప్రసాద్ శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా 4,480 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంట వేయగా, 220 ఎకరాల్లో పంట నీట మునగడంతో నష్టం జరిగిందన్నారు. నష్టాన్ని అంచనా వేసేందుకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. పంట నష్టం జాబితాలో 230 మంది రైతుల పేర్లతో నివేదికను ప్రభుత్వానికి పంపినట్టు వివరించారు. హెక్టారుకు రూ.17వేలు పంట నష్ట అందుతుందన్నారు.

స్పీకర్‌ను కలిసిన సీఐ రేవతమ్మ


అయ్యన్న దంపతులతో సీఐ రేవతమ్మ

నర్సీపట్నం అర్బన్ , సెప్టెంబరు 14 : నర్సీపట్టణం రూరల్ సీఐగా శనివారం రేవతమ్మ బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ వెంట పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు, మాకవరపాలెం ఎస్ఐ దామోదర్ నాయుడు, గొలుగొండ ఎస్ఐ రామారావు, కృష్ణాదేవిపేట ఎస్ఐ దివ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం అభినందనీయం

▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


ఎమ్మెల్యే రాజుకు చెక్ అందజేస్తున్న గణేశ గాయత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు

చోడవరం, సెప్టెంబరు 14 : విజయవాడ వరద బాధితుల సహాయం అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. వరద బాధితుల సహాయార్థం శనివారం స్థానిక గణేశ గాయత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు ప్రతినిధులు రూ.42 వేల 502 చెక్కును ఎమ్మెల్యే రాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా ట్రస్టు అధ్యక్షుడు పుట్రేవు శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షుడు ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, కార్యదర్శి వింజమూరి శంకర్, కోశాధికారి కందర్ప సత్యనారాయణ, సభ్యులు వారణాసి రామలింగ శాస్త్రి, భాస్కరరావు, సీతారామయ్య, రాంబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అవమానాలు భరించలేకే వైసీపీని వీడా

▸ కె.కోటపాడు సర్పంచ్ భవానీ



కె.కోటపాడు, సెప్టెంబరు 14 : వైసీపీ స్థానిక నేతలు గత మూడున్నరేళ్లుగా తనను అవమానానికి గురి చేశారని, కనీసం గ్రామ సచివాలయంలో కుర్చీ లేకుండా చేశారని కె.కోటపాడు సర్పంచ్ ఎర్రంశెట్టి భవానీ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను భరించేలేకే ఆ పార్టీకి దూరంగా ఉంటున్నానని అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ తనతో బలవంతంగా మెడికల్ లీవ్ పెట్టించారని ఆరోపించారు. ఉప సర్పంచ్ అయిన ఎంపీపీ భార్య రెడ్డి అరుణను సర్పంచ్ సీట్లో కూర్చోబెట్టి పాలన సాగించారని అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అండదండలతో తనను మానసికంగా వేధించి తనను అడుగడుగునా అణగదొక్కే ప్రయత్నం చేశారన్నారు. ఎంపీపీ వ్యవహారశైలి నచ్చకపోవడం వల్లే ఆ పార్టీని వీడవలసి వచ్చిందన్నారు. తన ఇష్ట ప్రకారమే టీడీపీలో చేరానని, తనపై ఎవరి బలవంతం లేదని అన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు

▸ 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి రత్నకుమార్



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ రత్నకుమార్

చోడవరం, సెప్టెంబరు 14 : కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఒక చక్కని పరిష్కారమార్గమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.రత్నకుమార్ సూచించారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించిన సందర్భంగా కక్షిదారులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన లేక చాలామంది చిన్నచిన్న తప్పిదాలతో జైలు పాలవుతున్నారని, తద్వారా తమ విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే నేరాలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రబాబు, జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల డేవిడ్, గొర్లె కృష్ణవేణి, న్యాయవాదులు పైడిరాజు, శివప్రసాద్, సీఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భస్మసహిత చందన అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



చోడవరం, సెప్టెంబరు 14 : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన శనివారం స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరుడు భస్మ సహిత చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి స్వామిని ముస్తాబు చేశారు. స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అధ్వానంగా జీసీసీ పెట్రోల్ బంక్ నిర్వహణ

- ▸ తరచూ పెట్రోల్ కొరత
- ▸ ఇక్కడ పవర్ పెట్రోల్ మాత్రమే దిక్కు
- ▸ ఒక్కటే పీవోఎస్ మిషన్
- ▸ నగదు రహిత లావాదేవీలకు అవస్థలు
- ▸ నాలుగు నెలలుగా వినియోగదారులు ఇబ్బందులు


నర్సీపట్నంలోని జీసీసీ పెట్రోల్ బంకు

నర్సీపట్నం, సెప్టెంబరు 14 : స్థానిక జీసీసీ పెట్రోల్ బంక్ నిర్వహణ అధ్వానంగా మారడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బంకులో 4 పెట్రోల్, 2 డీజిల్, 2 పవర్ పెట్రోల్ పంపులు ఉన్నాయి. ప్రభుత్వం నడుపుతున్న బంక్ కావడంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి నర్సీపట్నం వచ్చిన వాహనదారులు అక్కడే పెట్రోల్ కొట్టిస్తుంటారు. దీంతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుంది. జీసీసీ పెట్రోల్ బంక్ వచ్చిన తర్వాత మిగిలిన పెట్రోల్ బంకుల్లో అమ్మకాలు పడిపోయాయి.

అయితే గత నాలుగైదు నెలలుగా జీసీసీ బంకులో తరచూ పెట్రోల్ అందుబాటులో ఉండడం లేదు. ఎప్పటికప్పుడే నో స్టాక్ బోర్డు కనిపిస్తూ ఉంటుంది. పవర్ పెట్రోల్ మాత్రమే ఉందంటూ సిబ్బంది చెబుతుంటారు. సాధారణ పెట్రోల్ కంటే పవర్ పెట్రోల్ రూ.7 ధర అధికంగా ఉంటుంది. అక్కడి వరకు వచ్చిన కొందరు వినియోగదారులు తప్పనిసరి పరిస్థితిలో పవర్ పెట్రోల్ పోయించుకోవాల్సి వస్తోంది. చాలా మంది పెట్రోల్ లేదని వెను తిరిగి వెళ్లి పోతున్నారు. బుధవారం కూడా పెట్రోల్ లేదని చెప్పడంతో వినియోగదారులకు పవర్ పెట్రోల్ దిక్కు అయింది. ఈ విధంగా నిర్వహణ అధ్వానంగా ఉండటంతో రోజుకు 4 వేల లీటర్లు అమ్మకాలు నుంచి ఇటీవల 3 వేల లీటర్లకు అమ్మకాలు పడిపోయాయి.

8 పంపులకు ఒక్కటే పీవోఎస్ సిస్టమ్

నగద రహిత లావాదేవీలకు ప్రజలు బాగా అలవాటు పడ్డారు. చిన్న చిన్న కూరగాయల నేల దుకాణాల వద్ద కూడా యూపీఐ క్యూఆర్ స్కానర్లు ఉంటున్నాయి. అయితే జీసీసీ పెట్రోల్ బంకులో డిజిటల్ లావాదేవీల కోసం ఏర్పాటు చేసిన స్కానర్లు తీసేశారు. మొత్తం 8 పంపులకు ఒకే ఒక పీవోఎస్ మిషన్ వాడుతున్నారు. వాహనాల్లో ఆయిల్ పోయించుకోక ముందే పీవోఎస్ మిషన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు చెల్లించాలి. అక్కడున్న ఒక పీవోఎస్ మిషన్‌తో నాలుగు 8 పంపుల వద్ద స్కాన్ చేయడం వలన లావాదేవీలకు ఆలస్యం జరుగుతుంది. సమయం వృథా అవుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎందుకో జీసీసీ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఈ విషయమై జీసీసీ పెట్రోల్ బంక్ మేనేజర్ ప్రసాద్‌ను అడగ్గా పీవోఎస్ సిస్టమ్స్ సమస్య మీద బ్యాంకు అధికారులతో మాట్లాడామని అన్నారు. పెట్రోల్ సమస్య లేకుండా చూసుకుంటామని చెప్పారు.

మాడుగులలో రెండు పరిశ్రమల ఏర్పాటుకు కృషి

▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, సెప్టెంబరు 14 : మాడుగుల నియోజకవర్గంలో రెండుచోట్ల పరిశ్రమలు ఏర్పాటుకు ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి-ఎ.అగ్రహారం సమీపంలో గల ప్రభుత్వ, రైతుల భూములను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఈ రోజు వరకూ అభివృద్ధిలో ఉమ్మడి విశాఖ జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే మాడుగుల ఆమడ దూరంలో ఉందన్నారు. ఈ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. కె.కోటపాడు మండలం ఆర్లిలో ఒక పరిశ్రమ, చీడికాడ మండలం జి.కొత్తపల్లి బైలపూడి మధ్యలో మరో పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం చీడికాడ మండలంలో సుమారు 500 ఎకరాలకు పైగా భూములను సేకరించాల్సి ఉందని, దీనికి రైతులు కూడా ముందుకువస్తే వారికి ప్రభుత్వం నుంచి పరిహారం కూడా అందిస్తామన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని, తద్వారా ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు, ఉమ్మడికూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనాలు, అన్న సమారాధనలు


బుచ్చెయ్యపేట : వినాయకుడుని దర్శించుకుంటున్న తాతయ్యబాబు


చోడవరం : పీఎస్ పేట లక్ష్మీగణపతి వేడుకల్లో ఎమ్మెల్యే రాజు, మల్లునాయుడు తదితరులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 14 : మండలంలో వినాయకచవితి ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వడ్డాది-కొత్తూరు, బంగారుమెట్టలో మండపాల్లో నెలకొల్పిన వినాయకుడుని శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు దర్శించుకుని పూజలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో ఉత్సవ కమిటీలు నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్, టీడీపీ నాయకులు దొండా గిరిబాబు, సాయం శేషు, దొండా శ్రీను, ఏ.కనకరాజు, సాయం అయ్యన్నదొర, బత్తుల వంశీ పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట :గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, సీహెచ్ నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా ఏఎల్‌పురం హైస్కూల్ దగ్గర, బీసీ కాలనీ, గొల్లవీధి, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాల వద్ద భారీ అన్నసమరాధనను నిర్వహక కమిటీల ఆధ్వర్యంలో చేపట్టారు. మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతి కార్యక్రమాల నడుమ బొడ్డేరు గెడ్డల్లో వినాయక నిమజ్జనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, గోర్లి లక్ష్మణ్, రుత్తల రమణ, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని వేచలంలో వినాయక పూజల్లో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించార.

టీడీపీ నాయకులు రెడ్డి బలరాం, రెడ్డి శ్రీనువాసరావు, రెడ్డి సత్యారావు పాల్గొన్నారు. అలాగే దేవరాపల్లి మోడల్ కాలనీలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ కృష్ణమూర్తి అన్న సమారాధనలో పాల్గొన్నారు. మారేపల్లిలో పైలా ప్రసాదరావు అన్నసమారాధన చేపట్టారు.

చోడవరం : పట్టణ శివారు పీఎస్‌పేట లక్ష్మీగణపతి ఆలయంలో శనివారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. అంతకుముందు దేవాలయంలో మహిళలు సామూహిక అర్చనలు, లక్ష కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ శ్యాం, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


దేవరాపల్లి : వేచలంలో పూజల్లో పాల్గొన్న మాజీఎమ్మెల్యే రామానాయుడు


కృష్ణాదేవిపేట : అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మృతుడి కుటుంబానికి బీమా చెక్ అందజేత


చెక్ అందజేస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

గొలుగొండ, సెప్టెంబరు 14 : మండలంలోని జి.కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీల సభ్యుడు కూండ్రపు సత్తిబాబు గత జూన్‌లో ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. అతడి కుటుంబానికి రెండు లక్షల రూపాయల బీమా చెక్కు స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు శనివారం నర్సీపట్నంలో అందజేశారు. టీడీపీ కార్యకర్తలకు అన్ని విధాలా తమ పార్టీ అండగా వుంటుందని అయ్యన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కె.రవివర్మ, టీడీపీ నాయకులు కె.గోవిందరావు, రామరాజు, బాబులు తదితరులు పాల్గొన్నారు.

వీసీఐ కారిడార్‌పై 17న ప్రజాభిప్రాయ సేకరణ

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 14 : నక్కపల్లి మండలంలో విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుపై ఈ నెల 17న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అవసరమైన సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆర్డీవో జయరాం ఆదేశించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాయంలో నక్కపల్లి తహసీల్దార్, రెవెన్యూ, సర్వే సిబ్బందితో ఆర్డీవో సమావేశమయ్యారు. నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట, పీఎల్‌పురం, అమలాపురం, బుచ్చియ్యపేట, చందనాడ, వేంపాడు గ్రామాల పరిధిలో కారిడార్ ఏర్పాటు చేయబోతున్నారని తెలిపారు. ఆ గ్రామాల పరిధిలో ప్రభుత్వ, డి.పట్టా భూములు వివరాలు, రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజాభిసేకరణకు పక్కా సమాచారంతో హాజరు కావలని అన్నారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి తహసీల్దార్ అంబేడ్కర్, డివిజనల్ సర్వే విభాగం పరిశీలకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు


బుచ్చెయ్యపేటలో నివాళులు అర్పిస్తున్న నేతలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 14 : సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని చోడవరం డివిజన్ సీపీఎం నాయకుడు పినపాత్రుని సాంబశివరావు అన్నారు. ఆయన శనివారం బంగారుమెట్టలో జరిగిన ఏచూరి సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సాంబశివరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో సీతారాం కీలకపాత్ర పోషించారన్నారు. ఫాసిస్ట్, మతతత్వ శక్తులు పెచ్చుమీరుతున్న కాలంలో వామపక్షానికి, దేశానికి దిక్సూచిగా నిలవాల్సిన ఏచూరిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శిరిగిరిశెట్టి నానాజీ, బత్తుల శ్రీను, బైన మణికంఠ, సాయం శేషు, ఆరిపాక కామేశ్వరరావు, గొంతిన సన్నిబాబు, బత్తుల రమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చీడికాడ : సీతారామ్ ఏచూరి మృతి పార్టీకి సీపీఎంకు తీరని లోటు అని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడునాయుడు అన్నారు. చీడికాడలో శనివారం సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు ఎం.జానకి పాల్గొన్నారు.

చోడవరం : సీపీఎం నేత ఏచూరి మృతికి సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం సంతాప సభ నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు. సీఐటీయూ నేతలు వీవీ శ్రీనివాసరావు, ఎస్వీ నాయుడు, గూనూరు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

తట్టబందలో వీధి దీపాల ఏర్పాటు


వీధి లైట్లకు మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్ రమణ

రావికమతం, సెప్టెంబరు 14 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో గ్రామంలో డ్రైనేజీలలో పూడిక, రోడ్లకు ఇరువైపులా పేరుకు పోయిన తుప్పలను తొలగించారు. తాగునీటి వనరులలో క్లోరినేషన్ చేయించారు. అలాగే పంచాయతీ పరిధిలోనున్న తట్టబందతో పాటు సాయినగర్, బూరుగుపాలెం, బల్లిపాలెం, పోర్లుపాలెం, కశిరెడ్డి పాలెం, ఎల్ఎస్ పురం గ్రామాల్లో సుమారు రూ.ఐదు లక్షలతో వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఎస్ఐలు బాధ్యతల స్వీకారం


శ్రీనివాసరావు


రఘువర్మ

రావికమతం, సెప్టెంబరు 14 : మండలంలో రావికమతం, కొత్తకోట ఎస్సైలుగా ఎం.రఘువర్మ, ఎం.శ్రీనివాసరావులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకూ ఇక్కడ పని చేస్తున్న రావికమతం ఎస్సై ధనుంజయనాయుడును అనకాపల్లికి, కొత్తకోట ఎస్సై లక్ష్మణరావును కశింకోటకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో అనకాపల్లి ఉమెన్ పీఎస్‌లో (అటాచ్ ఐటీ కోర్) నుంచి రావికమతం ఎస్ఐగా, అనకాపల్లి పీసీఆర్ నుంచి ఎం.శ్రీనివాసరావును కొత్తకోట ఎస్సైగా నియమించారు.

ఘనంగా ఓనం సంబరాలు


ఆటల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

దేవరాపల్లి, సెప్టెంబరు 14 : కైరళీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఓనం పండగ సంబరాలు నిర్వహించారు. ఆదివారం పండగ నేపథ్యంలో ముందస్తుగా వేడుకలు జరుపుకున్నారు. కైరళీ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

చౌడువాడలో మెగా వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కె.కోటపాడు, సెప్టెంబరు 14 : మాజీ ఐఏఎస్ అధికారి, దివంగత డాక్టర్ సంతానం జ్ఞాపకార్థంగా ఏర్పాటైన సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చౌడువాడ పీహెచ్‌సీ ఆవరణలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలైన మల్లంపాలెం, పాచిలవానిపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి, గొండుపాలెం గ్రామాలకు చెందిన సుమారు 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాసన్, అనురాధ, వైద్యాధికారులు డాక్టర్ రాజా, డాక్టర్ నిర్మల, డాక్టర్ తరణి, మైత్రి నేత్రాలయ వైద్యులు, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ రాజేశ్ పాల్గొన్నారు.

బొర్రా గుహలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి



వారికి సరైన ప్రయాణ,పార్కింగ్, వసతి సౌకర్యాలు లేవు. ఈ నేప థ్యంలో 5.89 ఎకరాల్లో రూ.24 కోట్లతో సౌకర్యాలు సమకూర్చాలని ఏపీటీడీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో అచ్చంగా రెండు ఎకరాల స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించారు. అలాగే బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో అందమైన ద్వారం, గుహల వద్ద మరో ద్వారం నిర్మిస్తారు. ఆ ప్రాంతం వాహనాల పొగతో కాలుష్యమయం కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలను నడుపుతారు. వాటి ద్వారా పర్యాటకులను గుహలకు తీసుకువెళ్లి తీసుకువస్తారు. పర్యాటకుల కోసం టాయిలెట్లు, లగేజీ భద్రపరుచుకునే గదులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తారు.

ప్రత్యేకంగా మార్కెట్ స్ట్రీట్

బొర్రా గుహల ముందు గిరిజనులు తయారుచేసిన, పండించిన వాటిని విక్రయిస్తున్నారు. దీనిని మార్కెట్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేస్తారు. రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. పర్యాటకులు పక్కనే ఉన్న లోయ అందాలను తిలకించేందుకు వ్యూపాయింట్లు, విజువల్ డెక్ ఏర్పాటుచేస్తారు. సిటింగ్ ఏరియా ఉంటుంది. అడ్వంచర్ స్పోర్ట్స్ ఎగ్జిబిషన్ వంటివి పెడతారు.

విజటర్స్ కౌంటర్

పర్యాటకుల వసతి కోసం రెండు అంతస్థుల భవనం నిర్మిస్తారు. ఇక్కడే టికెట్లు, బ్యాగేజీ, రెస్టారెంట్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఇక గుహల లోపల అవసరమైన ప్రాంతాల్లో స్టెయిర్ కేసులు, రెయిలింగ్‌లు పెడతారు. కొత్తగా విద్యుద్దీపాలు అమరుస్తారు. సీసీ టీవీ కెమెరాలు వంటివి ఉంటాయి.

సౌండ్ అండ్ లైటింగ్ షో

గుహ లోపలి అందాలను విభిన్న కోణాల్లో చూపించడానికి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తారు. దాంతో కళ్ల ముందు రంగుల ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. ఇది మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాజెక్టుకు టెండర్లు సమర్పించడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు పర్యాటక శాఖ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీనివాస పాణి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఘనంగా హిందీ దివాస్


హిందీ దివాస్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 14 : మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం హిందీ దినోత్సవాన్ని హిందీ అధ్యాపకులు దేవరపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమగ్రతకు హిందీ భాష ఎంతో అవసరమన్నారు. ప్రతీ ఏటా ఈ కళాశాలలో హిందీ సబ్జెక్ట్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధిస్తుండడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శిరీషారాణి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : హిందీ భాషా దినోత్సవాన్ని వడ్డాది జూనియర్ కళాశాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వైవీవవవఎల్ అన్నపూర్ణ మాట్లాడుతూ జాతీయ బాష హిందీని నేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. హిందీ అధ్యాపకులు ఇ.నర్సింహామూర్తి మాట్లాడుతూ వ్యోహార్ రాజేంద్ర సింహ హిందీని రాజభాషగా అమలు చేయడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభ, నారిబాబు, విజయకుమార్ పాల్గొన్నారు.

చెట్టుపల్లి పీఏసీఎస్‌లో నిధుల స్వాహాపై సీరియస్

... 5వ పేజీ తరువాయి

చేయడానికి డివిజనల్ రిజిస్ట్రార్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చెట్టుపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఉన్న సీహెచ్ మరిడయ్య.. డివిజనల్ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్‌చార్జి ఆర్డర్‌ను అందుకున్నారు. ఈ ఆర్డర్ కాపీని గత సీఈవో చలపతిరావుకు కూడా అందజేస్తామని మరిడయ్య తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తీర్మానం చేసి డివిజనల్ రిజిస్ట్రార్ కోర్టులో ఈపీ (ఎగ్జిక్యూటివ్ పిటిషన్) ఫైల్ చేస్తామని చెప్పారు. దీని తరువాత నిధులు రికవరీ చేయడానికి ఒక సేల్స్ ఆఫీసర్‌ను నియమిస్తారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన గత సీఈవో ఆస్తులు జప్తు చేయడానికి నోటీసులు ఇస్తారు. దీనిపై పీఏసీ అధికారి సీహెచ్ మరిడయ్యను వివరణ కోరగా డివిజన్ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్‌చార్జి ఆర్డర్ ప్రకారం నిధుల రికవరీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేజీబీవీల్లో టీచర్ల కొరత

... 5వ పేజీ తరువాయి

గణితం టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే రావికమతం మండలం గర్నికం కేజీబీవీలో గణితం, జువాలజీ (పీజీటీ), వి.మాడుగులలో ఫిజికల్ సైన్స్, బోటనీ, ఎస్.రాయవరం మండలం తిమ్మాపురంలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతేడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు కొనసాగినా అప్పటి నుంచి ఇప్పటి వరకు వారిని రెన్యూవల్ చేయలేదు. దీని ప్రభావం విద్యార్థినుల చదువుపై పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.